APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్

# వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 86 | ఆగస్టు 17 సోమవారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## 'ప్రత్యేక మిత్రుల'తో మోదీ ముచ్చట!

భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల వేళ ఒక ఆసక్తికరమైన, హృదయానికి హత్తుకునే సన్నివేశం బయటకొచ్చింది. ఎర్రకోట (లాల్ ఖిల్లా) వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతిని ఉద్దేశించి ప్రసంగించే ముందు ప్రధాని నరేంద్ర మోదీ తన లోక్ కల్యాణ్ మార్గ్ ల నివాసంలో నెలకొన్న ఒక ఆహ్లాదకరమైన ఘట్టాన్ని సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు. ప్రతిరోజూ ఉదయాన్నే తన నివాసంలోని మూగజీవాలు, పశువులకు మేత తినిపించడం ప్రధాని మోదీకి అలవాటు. అయితే ఆగస్టు 15న ఎర్రకోట వద్ద వేడుకల కోసం ఆయన ఉదయాన్నే బయలుదేరాల్సి వచ్చింది. ఈ క్రమంలో జరిగిన అనుభవాన్ని ప్రధాని ఇన్‌స్టాగ్రామ్‌లో గుర్తుచేసుకుంటూ 'రోజూ ఉదయం నా మిత్రులకు (జంతువులకు) మేత తినిపించడం నా దినచర్య. కానీ నిన్న ఉదయం నేను త్వరగా బయలుదేరుతున్నానని గ్రహించి కాబోలు.. నేను ఎర్రకోటకు వెళ్లేముందు నన్ను కలవడానికి వచ్చాయి' అని పేర్కొన్నారు.

## ఒమన్ చర్చలు వేరు.. హోర్ముజ్ తెరవడం వేరు: ఇరాన్

టెహ్రాన్, : ఒమన్‌తో ఇరాన్ జరుపుతున్న చర్చలు కేవలం సాంకేతికపరమైన నావిగేషన్ మార్గాల ఖరారు కోసమేనని, హోర్ముజ్ జలసంధిని తెరవడానికి దీనికి సంబంధం లేదని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టం చేశారు. గతంలో ఉపయోగించిన సముద్ర రవాణా మార్గాలు ప్రస్తుతం పనిచేయడం లేదని, అందువల్ల నౌకల రాకపోకల కోసం తాత్కాలికంగా కొత్త రూట్‌ను డిజైన్ చేస్తున్నామని అరాగ్చీ తెలిపారు. ఒమన్‌తో జరుగుతున్న సంప్రదింపులు కేవలం నౌకల రాకపోకల కోసం మార్గాన్ని కేటాయించే సాంకేతిక చర్చలు మాత్రమే.. కొత్త సముద్ర మార్గాన్ని ఏర్పాటు చేసినంత మాత్రాన హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరిచినట్లు కాదు. అమెరికా తనపై ఉన్న నిర్దిష్ఠ నిబంధనలు/షరతులను నెరవేర్చినప్పుడు మాత్రమే ఈ కీలక జలసంధి ద్వారా నౌకల రాకపోకలను పునఃప్రారంభించే అంశాన్ని పరిశీలిస్తామని అరాగ్చీ స్పష్టం చేశారు.

# స్థానికంలో బీసీ రిజర్వేషన్లు లేనట్లే..?

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు పెరిగే అవకాశం లేదని చెబుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా కూటమి నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఈ మేరకు సంకేతాలిచ్చారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే వెనుకబడిన తరగతులకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. అయితే రాజ్యాంగ నిబంధనల ప్రకారం మొత్తం రిజర్వేషన్లు 50 శాతం పెరగడానికి వీలు లేదని అంటున్నారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ నివేదికతో బీసీ రిజర్వేషన్లు పెంచాలని నిర్ణయించారు. అయితే శనివారం నివేదిక సమర్పించిన కమిషన్ ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లను మరో నాలుగు శాతం మేర పెంపునకు ఇబ్బంది లేదని సూచించింది. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచనలో పడిందని అంటున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీసీలకు 23.84 శాతం రిజర్వేషన్లు అమలు అవుతున్నాయి. రాజీవ్ రంజన్ మిశ్రా డెడికేటెడ్ కమిషన్ సిఫార్సుల మేరకు బీసీ జనాభాకు తగినట్లు మరో 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచడానికి మాత్రమే అవకాశం ఉందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో మొత్తం బీసీ జనాభా 50.26 శాతం కాగా, ఆ లెక్కన 27.66 శాతం వరకు స్థానిక ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు అమలు చేయడానికి సమస్య ఉండదని అంటున్నారు. అయితే ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మాట ఇచ్చారు. ఎన్నికల హామీ అమలు చేయాలంటే రాజ్యాంగ సవరణ చేయాల్సివుంటుంది. ఇందుకు కుల గణన జరగాలి. దేశంలో 1931 తర్వాత ఎక్కడా కుల గణన చేయలేదని అంటున్నారు. ప్రస్తుతం ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నా, ఈ ప్రక్రియ ముగియడానికి మరో ఏడాది పడుతుందని భావిస్తున్నారు. అయితే వచ్చేనెల నుంచి ఎన్నికల ప్రక్రియ మొదలుపెట్టాలని భావిస్తున్న ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లపై విస్తృతంగా సమాలోచనలు చేస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే ఉద్దేశంతో ప్రత్యామ్నాయాలు పరిశీలిస్తోందని చెబుతున్నారు. 50 శాతం మించకూడదని సుప్రీంకోర్టు ఇప్పటికే స్పష్టం చేసింది. తెలంగాణలో కూడా బీసీ రిజర్వేషన్లు పెంచాలని చూసినా సుప్రీం కోర్టు తీర్పు కారణంగా బ్రేక్ పడింది. దీంతో అక్కడ పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసి ఎన్నికలు నిర్వహించారని చెబుతున్నారు. ఇక రాష్ట్రంలో సుప్రీంకోర్టు సూచనల మేరకు డెడికేటెడ్ కమిషన్ సిఫార్సులతో రిజర్వేషన్లు పెంచుకోవాలని చూసినా, అందుబాటులో ఉన్న కులాల లెక్కలతో కేవలం 3.82 శాతం మేర రిజర్వేషన్లు పెంచేందుకే అవకాశం ఉందని అంటున్నారు. దీంతో ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానికంలో బీసీ రిజర్వేషన్లపై ఆలోచన మార్చుకున్నట్లు చెబుతున్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా 34 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యమయ్యేలా లేదని భావిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ మోడల్ ను అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు చెబుతున్నారు. ప్రభుత్వ పరంగా రిజర్వేషన్లు అమలు చేయకపోయినా కూటమిలోని మూడు పార్టీలు కలిపి 34 శాతం




స్థానాలలో బీసీలను పోటీపెట్టాలని భావిస్తున్నారని అంటున్నారు. శనివారం కూటమి పక్షాల నేతలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్సులో ఇదే విషయాన్ని స్పష్టం చేశారని చెబుతున్నారు. దీంతో స్థానికంలో బీసీ రిజర్వేషన్ పెరిగే పరిస్థితి కనిపించడం లేదన్న విషయం స్పష్టం అవుతోందని అంటున్నారు.

## పది లక్షల కోట్ల రుణాలు...ఒక్క దెబ్బతో రద్దు !




పేదవాడు సామాన్యుడు బ్యాంకులకు వెళ్తే వారికి అక్కడ సవా లక్ష నిబంధలు ఎలా ఇబ్బంది పెడతాయో అందరికీ తెలిసిందే. సంతకం చివర చిన్న గీత ఉన్నా మీది కానే కాదంటారు. ఇక అప్పులు తీసుకుంటే సకాలంలో చెల్లించకపోతే బ్యాంకులు అసలు ఊరుకోవు. ముక్కు పిండి మరీ వసూలు చేస్తాయి. కానీ అదే బడా బాబులు కార్పోరేట్ పెద్దలు అంటే మాత్రం రుణాలు ఇవ్వడమే తప్ప వసూళ్ళు ఉండవని విమర్శలు ఉన్నాయి. అంతే కాదు వారి రుణాలను మొండి బాకీలుగా రాని బాకీలుగా చూపించి ఏదో రోజున రైట్ ఆఫ్ అంటూ రద్దు చేయడమూ జరుగుతున్న సంగతి తెలిసిందే. ఇక కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గడచిన పన్నెండేళ్లలో బడా బాబులు తీసుకున్న రుణాలు అక్షరాలా 9, 95 లక్షల కోట్లు అంటే సుమారుగా పది లక్షల కోట్ల రూపాయల రుణాలను రైట్ ఆఫ్ పేరుతో రద్దు చేసి పారేసారు. ఈ వివరాలను అధికారికంగా తెలియచేసింది. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి. ఆయన పార్లమెంట్ లో ప్రశ్నకు లిఖిత పూర్వకమైన జవాబు చెబుతూ ఈ వివరాలు వెల్లడించారు ఇందులో చూస్తే అత్యధికంగా 2018-19 ఆర్థిక సంవత్సరంలో 1.48,753 కోట్ల రూపాయల రుణాలను రద్దు చేస్తే 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏకంగా పెద్ద పరిశ్రమలు సేవలకు సంబంధించిన బకాయి పద్ద రుణాలు మొత్తాలు 63,19,057 కోట్లుగా ఉంటే 2026 ఆర్థిక సంవత్సరంలో ఈ మొండి బకాయిలు 69,21,734 కోట్ల రూపాయలకు పెరిగాయని కేంద్ర మంత్రి అధికారికంగా చెప్పారు. అంటే ఈ రోజున దేశంలో బడా బాబుల రుణాలు దాదాపుగా డెబ్బై లక్షల కోట్ల దాకా ఉన్నాయని అంటున్నారు. అయితే దీని మీద విపక్షాల అభ్యంతరాలకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వివరణ ఇస్తూ ఇది కేవలం బ్యాంకులు తమ ఖాతా పద్దు పుస్తకాలను సరి చేసుకునే ఒక అకౌంటింగ్ ప్రక్రియ మాత్రమే అని అంటున్నారు. దీని వల్ల కార్పోరేట్ సంస్థల రుణాల మాఫీ కానీ రద్దు కానీ జరగదని అంటున్నారు. ఇది కేవలం సాంకేతిక ప్రక్రియ మాత్రమే అని రుణ గ్రహీతలకు ఉప శమనం కలిగించేందుకు రుణాలను పునర్ వ్యవస్థీకరించే విధానం అన్నారు. ఈ మేరకు బ్యాంకులకు విచక్షణాధికారాన్ని ఇస్తూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రిజల్యూషన్ ఆఫ్ స్ట్రెస్డ్ అసెట్స్ డైరెక్షన్స్ 2025 జారీ చేసినట్లుగా కేంద్ర మంత్రి చెబుతున్నారు. అయితే సాంకేతికంగా బాలెన్స్ సర్దుబాటు చేసుకున్నాక ఇక కార్పోరేట్లు బడా బాబులు రుణ ఉపశమనం పొందాక ఏ మేరకు తిరిగి తమ రుణాలకు చెల్లిస్తాయో అందరికీ తెలిసిందే అని అంటున్నారు. సామాన్యుడు రుణం తీసుకుంటే వెంట పడి వసూలు చేసే విధానం బడా బాబుల విషయంలోనూ రావాలని అంటున్నారు. లేకపోతే అది తప్పుడు సంకేతాలు వెళ్ళేలా చేస్తుందని అంటున్నారు. ఒక్కసారి ఖాతా పద్దులలో సర్దుబాటు జరిగిన మీదట రుణాలను బడా బాబుల నుంచి వసూలు చేయడం ఎవరి తరం అని అంటున్నారు. ఈ విధంగా పెద్దలకు గద్దలకు అనుగుణమైన తీరుని అనుసరిస్తూ దీనిని ఆర్థిక క్రమశిక్షణగా చూపించే ప్రయత్నం పట్ల విపక్షాలు అయితే మండిపడుతున్నాయి. పేదలు రైతులకు రుణాల మాఫీ ఎందుకు జరగదని కూడా ప్రశ్నిస్తున్నారు.

# పవన్ మౌనం...దూరం !




ఏపీలో ఒక పెద్ద చర్చ అయితే సాగుతోంది. అదేంటి అంటే ఏపీలో కూటమి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా టీడీపీ తరువాత రెండవ అతి పెద్ద పార్టీ జనసేన అధినేతగా ఉన్న పవన్ కళ్యాణ్ వైఖరి మీదనే అని అంటున్నారు. పవన్ ఇటీవల కాలంలో వ్యవహరిస్తున్న తీరు పట్ల కూడా రాజకీయ విశ్లేషకుల నుంచి అంతా నిశితంగా గమనిస్తూ బిగ్ డిబేట్ చేస్తున్నారు. పవన్ తన పని తాను చేసుకుని వెళ్తున్నారు. అదే సమయంలో ఆయన కూటమి పెద్దలకు దూరం పాటిస్తున్నారు. అలాగే ఒక్క మాట పల్లెత్తు కూడా అనకుండా మౌనం వహిస్తున్నారు. మరి ఈ మౌనానికి దూరానికి కారణం ఏమిటి అన్నదే ఈ అతి పెద్ద చర్చ అని అంటున్నారు. తాజాగా చూస్తే పవన్ తీవ్ర జ్వరంతో హైదరాబాద్ కి వెళ్ళడంతో గవర్నర్ నిర్వహించిన ఎట్ హోం కార్యక్రమానికి అటెండ్ కాలేకపోయారు. ఆయనకు ఒంట్లో బాగులేదు కాబట్టి వెళ్లడం జరిగింది. దాని కంటే ముందు ఆయన కుడి భుజానికి శస్త్ర చికిత్స జరిగింది. దాంతో పవన్ కొంత ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఎక్కడైనా ఎక్కువ సేపు కార్యక్రమాలు నిర్వహించిన పక్షంలో కొంత అలసటకు గురి అవుతున్నారని అంటున్నారు. తాజాగా జరిగింది కూడా ఇదే అని అంటున్నారు. అయితే పవన్ ఈ విధంగా ఎట్ హోం కి రాకపోవడం హెల్త్ గ్రౌండ్స్ లో అయినా దీని మీద కూడా చర్చ చేసే వారు ఉండడమే విశేషం. ఇక ఇంతకు ముందు వరసగా ఆయన కేబినెట్ సమావేశాలకు హాజరు కాలేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతీ నెలలో రెండు సార్లు కేబినెట్ మీటింగ్స్ నిర్వహిస్తోంది. పవన్ ఇది కూడా అనారోగ్య కారణాల వల్లనే హాజరు కాలేదని పార్టీ వర్గాలు చెబుతున్నా కూడా సం థింగ్ ఏదో జరిగింది అని చర్చకు పెట్టే వారూ లేకపోలేదు. మరో వైపు చూస్తే ప్రతీ మూడు నెలలకు ఒక మారు నిర్వహించే కలెక్టర్ సదస్సులకు పవన్ మొదట్లో వచ్చినంతగా తరువాత రాలేదని గుర్తు చేస్తున్నారు. ఇక కేబినెట్ మీటింగ్స్ కి వెళ్ళినా కొన్ని సార్లు మధ్యలోనే ఆయన అనారోగ్య కారణాలతో బయటకు రావడం కూడా జరిగిందని చెబుతున్నారు. ఇవన్నీ కూడా పవన్ కి ఒంట్లో బాగుండకనే జరిగాయి అని అంటున్నారు. కానీ ఇపుడు అవే పెద్ద ఇష్యూగా మార్చి బిగ్ డిబేట్ ని అయితే నిర్వహిస్తున్న తీరు సోషల్ మీడియాలోనూ వైరల్ అవుతోంది. ఇల లేటెస్ట్ గా మరో విషయం చూస్తే అమరావతి రోడ్ల అభివృద్ధి కార్యక్రమాలకు చంద్రబాబు ప్రారంభోత్సవం చేశారు. దీనికి కూడా పవన్ హాజరు కాలేదు, అయితే దానికీ కారణం ఉంది. అదే రోజున పవన్ విశాఖలో జరిగిన ప్రపంచ ఏనుగుల దినోత్సవం కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. ఇది ముందే షెడ్యూల్ చేయబడిన ప్రోగ్రాం అని కూడా ఉప ముఖ్యమంత్రి కార్యాలయ వర్గాలు తెలియచేసాయి. సరే ఇవన్నీ రొటీన్ అనుకున్నా సహజంగానే జరిగాయని అనుకున్నా కోడి గుడ్డు మీద ఈకలు తీయడమే రాజకీయాల్లో అంతా చూసేది చేసేది కాబట్టి పవన్ ఇటీవల మౌనంగా ఉండడంతోనే ఇంత పెద్ద చర్చ సాగుతోంది అని అంటున్నారు. ఇక ఆగస్టు 1న భోగాపురంలో జరిగిన విమానాశ్రయ ప్రారంభోత్సవంలో మాత్రమే చంద్రబాబు పవన్ బహిరంగంగా ఒకే వేదికను పంచుకున్నారు. అయితే అదే వేదిక మీద ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. ఇతర కేంద్ర మంత్రులు ఉన్నారు. దాని కంటే ముందూ తరువాత మాత్రం ఈ ఇద్దరు నేతలు కనిపించడం లేదన్న చర్చ కూడా సాగుతోంది. ఇక వీటన్నిటినీ పక్కన పెడితే ఈ నెల 17 నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు జరగబోతున్నాయి. ఆ సమావేశాలకు పవన్ హాజరవుతారా అన్నది కూడా రాజకీయ విశ్లేషకులు లేవనెత్తుతున్న సందేహంగా ఉంది. ఏమిటంటే ఆయన అనారోగ్యం కారణంగా రాలేకపోతారా అన్నదే చర్చగా ఉంది. ఒకవేళ పవన్ హెల్త్ ఇష్యూస్ తో గైర్ హాజరు అయినా అది కూడా మరో బిగ్ డిబేట్ కి కారణం అవుతుంది అనడంతో ఏ మాత్రం సందేహం అయితే లేదు.

# మరో హామీ అమలుకు కూటమి ప్రభుత్వం సిద్దం

, ఏపీ అసెంబ్లీ సమావేశాల వేళ సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. సోమవారం ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల వేదికగా కీలక బిల్లుల ఆమోదం కోసం ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన మరో ప్రధాన హామీ అమలుకు సిద్ధం అవుతోంది. ఇప్పటికే ఈ మేరకు చర్చలు జరిగాయి. దీంతో... ఈ అసెంబ్లీ సమావేశాల్లో కీలకంగా మారనున్నాయి. ఏపీ అసెంబ్లీ సమావేశాలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం సమావేశాలు ప్రారంభం కానున్నాయి. సమావేశాలకు సంబంధించిన ఏర్పాట్లపై శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఇటీవల ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. భద్రతా ఏర్పాట్లతో పాటు సభ సజావుగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశాలకు దూరంగా ఉండాలని వైసీపీ ఎమ్మెల్యేలు నిర్ణయించారు. మండలికి మాత్రం పార్టీ ఎమ్మెల్సీలు హాజరు కానున్నారు. ఇదే సమావేశాల వేదికగా ప్రభుత్వం కీలక నిర్ణయాలకు సిద్దం అవుతోంది. శాసన మండలిలో డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాల్లో చోటుచేసుకున్నా యంటున్న అక్రమాలు, ఔట్‌సోర్సింగ్ నియామకాల స్కామ్‌లు, ఇతర ప్రజా సమస్యలపై సభలో తీవ్రంగా నిలదీయాలని జగన్ తమ శాసనసభ్యులను ఆదేశించారు. ఈ అంశాలపై చర్చకు పట్టుబట్టాలని దిశా నిర్దేశం చేశారు. ఏపీలో డ్వాక్రా మహిళలకు పంద్రాగస్టు కానుక- మరో కొత్త పథకం..! అసెంబ్లీ వేదికగా కీలక నిర్ణయం ఇక, ఇటు ప్రభుత్వం ఈ సమావేశాల్లో కీలక బిల్లులను ప్రవేశ పెట్టనుంది. బీసీ రిజర్వేషన్లు, బీసీ రక్షణ చట్టం ప్రవేశ పెట్టేందుకు కసరత్తు చేస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ హామీ ఇచ్చింది. ఇప్పుడు ఆ హామీ దిశగా ప్రభుత్వం ఏర్పటు చేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. దీని పైన అధ్యయనం చేస్తున్న ప్రభుత్వం..



ఈ నెల 18న జరిగే కేబినెట్ భేటీలో నిర్ణయం తీసు కొనే అవకాశం ఉంది. రిజర్వేషన్ల అమలు పైన అసెంబ్లీ వేదికగా బిల్లు లేదా తీర్మానం ఆమోదించి ఎన్నికల వేళ ఇచ్చిన హామీ అమలు చేయాలని చంద్రబాబు డిసైడ్ అయ్యారు. అదే విధంగా అసెంబ్లీ వేదికగానే డీఎస్సీ పైన చేస్తున్న ఆరోపణలకు సమాధానం ఇవ్వాలని నిర్ణయించారు.

# ఏపీలో మరో మూడు ఎయిర్‌పోర్ట్‌లు

ఏపీలో మరో మూడు విమానాశ్రయాల ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. భోగాపురంలో కొత్తగా ఏర్పాటైన విమానాశ్రయం సోమవారం నుంచి ఆపరేషన్స్ ప్రారంభించనుంది. కాగా, ఇదే సమయంలో మూడు కొత్త ఏయిర్ పోర్టులకు సంబంధించి టెక్నో ఎకనమిక్ ఫిజిబులిటీ రిపోర్ట్ (టీఈఎఫ్ఆర్) సిద్దం అయింది. కేంద్ర విమానయాన శాఖకు ఇప్పటికే ప్రతిపాదనలు రాష్ట్రం నుంచి అందటంతో.. దీనికి సంబధించి ఆమోదం దిశగా అధ్యయనం కొనసాగుతోంది. ఏపీలో మరో మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల పైన కసరత్తు వేగవంతం చేసారు. ఇప్పటికే రాష్ట్రంలో ఉన్న విమానాశ్రయాలకు అదనంగా ఈ మూడు నిర్మాణాల పైన అవసరమైన రిపోర్ట్స్ సిద్దం అవుతున్నాయి. భోగాపురం విమానాశ్రయం ప్రారంభం తరువాత ఇతర ప్రాంతాల్లోనూ కొత్తగా డిమాండ్లు వస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన హామీ మేరకు రాజధాని అమరావతి, కుప్పం, శ్రీకాకుళం వంటి ప్రాంతాల్లో కొత్త విమానాశ్రయాల పైన అధ్యయనం సాగుతోంది. ఇప్పటికే ఈ మూడు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటు పై టెక్నో ఎకనమిక్ ఫిజిబులిటీ రిపోర్ట్(టీఈఎఫ్ఆర్) సిద్దం చేసింది. సైట్ క్లియరెన్సుల కోసం కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినట్లు తెలుస్తోంది. కాగా.. ఈ ప్రాంతాల్లో భూ సమీకరణతో పాటుగా తొలి దశలో అయ్యే ఖర్చు పైనా అంచనాలు సిద్దం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ తాజా ప్రతిపాదనలతో ఈ విమానాశ్రయాల కోసం మొదటి దశలో రూ.5545 కోట్ల ఖర్చు అవుతుందని తేల్చారు. రాజధాని అమరావతిలో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించాలని భావిస్తున్నారు. ఇందుకోసం ఏకంగా 4618 ఎకరాలు అవసరమని ప్రాథమికంగా గుర్తించారు. నిర్మాణం కోసం రూ.4419 కోట్లు ఖర్చు అవుతుందని అంచనాకు వచ్చారు. వీటిల్లో రూ.1087 కోట్లను రోడ్లు, డ్రైనేజ్, ఇతర మౌలిక సదుపాయాల



కోసం ఉపయోగించనున్నారు. ఇక శ్రీకాకుళం ఎయిర్‌పోర్ట్ భూసేకరణ ప్రక్రియ కూడా ఇప్పటికే మొదలైంది. 1185 ఎకరాలను సేకరించేందుకు అధికారులు సిద్దమయ్యారు. తొలి దశలో రూ.392 కోట్లతో అభివృద్ధి చేయనున్నారు. కాగా, కుప్పం ఎయిర్‌పోర్ట్ కోసం 1788 ఎకరాలను ప్రభుత్వం గుర్తించింది. వీటిల్లో 1300 ఎకరాలను ఇప్పటికే సేకరించింది. తొలి దశలో రూ.734 కోట్లతో నిర్మించాలని ప్రణాళికలు రూపొందిస్తున్నారు. దీంతో.. ప్రభుత్వ తాజా ప్రతిపాదనలతో.. కేంద్ర విమానయాన శాఖ తీసుకునే నిర్ణయం ఇప్పుడు కీలకం కానుంది.

## పాల ఉత్పత్తుల కల్తీపై యూపీ సర్కార్ కఠిన చర్యలు

ప్రజారోగ్యాన్ని కాపాడే దిశగా యూపీ సర్కార్ కీలక నిర్ణయం తీసుకుంది. పాలు, పాల ఉత్పత్తుల కల్తీకి పాల్పడే సంస్థలను మూసేసి, వాటి లైసెన్స్ రద్దు చేసేందుకు నిర్ణయించింది. ఆహార నాణ్యత నిబంధనలపై ఇటీవల ఎఫ్ఎస్‌డీఏ ఆదేశాలకు అదనంగా మరిన్ని కఠిన చర్యలు తీసుకునేందుకు యోగి సర్కారు నిర్ణయించింది. ఇక కల్తీ జరిగినట్టు, హానికారక పదార్థాలు ఉన్నట్టు నిర్ధారణ అయితే నిబంధనల ఉల్లంఘించిన సంస్థల లైసెన్స్‌ను రద్దు చేయడంతో పాటు ఆ బ్రాండ్ ఉత్పత్తుల విక్రయాలపై రాష్ట్రవ్యాప్త నిషేధం విధిస్తారు. పాల విక్రయాలు, పాల ఉత్పత్తుల నాణ్యత కచ్చితంగా నిబంధనలకు అనుగుణంగా ఉండాలని ఫుడ్ సేఫ్టీ కమిషనర్ డా. రోషన్ జేకబ్ స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన తనిఖీల సందర్భంగా పలు చోట్ల పాలు పాల ఉత్పత్తుల్లో నిషేధిత పదార్థాలు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. రిఫైన్డ్ ఆయిల్, కొవ్వు, టాల్కమ్ పౌడర్, డిటర్జెంట్, టైటానియం డైయాక్సైడ్, హైడ్రోజన్ పెరాక్సైడ్ వంటివి బయటపడ్డాయి. ఈ నేపథ్యంలో ప్రజారోగ్యాన్ని కాపాడే దిశగా యోగి సర్కారు కఠిన చర్యలకు ఉపక్రమించింది.

## ఏనుగుల సంచారం.. ప్రజలను అప్రమత్తం చేయండి: పవన్ కళ్యాణ్

చిత్తూరు : చిత్తూరు జిల్లాల్లోని చంద్రగిరి సమీప ప్రాంతాల్లో ఏనుగుల సంచారం నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ( సంబంధిత అధికారులను ఆదేశించారు. అటవీ ప్రాంతాలకు సమీపంలోని గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏనుగుల కదలికలను నిరంతరం పర్యవేక్షించేందుకు డ్రోన్లను వినియోగించాలని, అటవీ సమీప గ్రామాల్లో రాత్రివేళ గస్తీని మరింత పెంచాలని అధికారులకు స్పష్టం చేశారు.

ఏనుగులు సంచరించే ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని పవన్ కల్యాణ్ సూచించారు. ఇందుకోసం రెవెన్యూ, పోలీసు, అటవీశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఏనుగుల కదలికలు కనిపించిన వెంటనే సమీప గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసేలా సమాచార వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. అటవీశాఖ ఆధ్వర్యంలో హనుమాన్ బృందాలను మోహరించి ఏనుగుల కదలికలను పర్యవేక్షించాలని అధికారులకు పవన్ కల్యాణ్ ఆదేశాలు ఇచ్చారు. ఏనుగులను రెచ్చగొట్టకుండా, వాటికి ఆటంకం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అదే సమయంలో ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. చంద్రగిరి పరిసర గ్రామాల్లో ఏనుగుల సంచారంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించేలా చర్యలు చేపట్టాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. అటవీ సమీప ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఏనుగులు కనిపిస్తే వాటికి దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించాలని పవన్ కల్యాణ్ మార్గనిర్దేశం చేశారు.

# కంబాల ఆధ్వర్యంలో ఘనంగా 'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ




గోకవరం ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1, రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలో భాగంగా గోకవరంలో శనివారం'హర్ ఘర్ తిరంగా' ర్యాలీ ఘనంగా నిర్వహించారు. తంటికొండ రోడ్డులోని సీఎండీ లే అవుట్ లో అలాగే ఎంపీడీవో కార్యాలయం సమీపం వద్ద ఉన్న జాతీయ జెండాను కంబాల శ్రీనివాసరావు ఎగరవేశారు. అనంతరం నాయకులు కార్యకర్తలు, అభిమానులు, యువత, మహిళలతో కలిసి ఎంపీడీవో కార్యాలయం నుంచి, దేవిచౌక్ మీదగా సీఎండీ కార్యాలయం వరకు దేశభక్తి నినాదాలు చేస్తూ, జాతీయ జెండాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కంబాల కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని, ప్రతి ఒక్కరు వందేమాతరం పాడాలని సూచించారు. దేశ స్వాతంత్ర స్ఫూర్తిని, త్రివర్ణ పతాక గౌరవాన్ని ప్రతి ఇంటికి చేర్చాలనే ఉద్దేశంతో హర్ ఘర్ తిరంగా' నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎందరో మహనుభావుల త్యాగాల ఫలితమే మనకు స్వాతంత్ర్యం వచ్చిందన్నారు. మహనీయుల త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని అన్నారు. కులం, మతం, భాష ఏదైనా మనమందరం భారతీయులమని స్పష్టం చేశారు. భిన్నత్వంలో ఏకత్వం అనే మన భారతీయ తత్వాన్ని ప్రతి ఒక్కరు ఆచరించాలన్నారు. అలాగే యువత, విద్యార్థుల్లో దేశభక్తి జాతీయత భావాలను పెంపొందించాలన్నారు. అనంతరం స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు...

# వైద్యాధికారి రామలక్ష్మి కి ఉత్తమ సేవా పురస్కారం



గోకవరం ఆగస్టు 16 జి ఎస్ బి వార్త :-స్వాతంత్ర దినోత్సవ వేడుకలు సందర్భంగా వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులకు అవార్డులు అందజేశారు. ఇందులో భాగంగా గోకవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి గా పనిచేస్తున్న డాక్టర్ ఎల్ రామలక్ష్మికు వైద్య ,ఆరోగ్య విభాగంలో ఉత్తమ సేవ పురస్కారం లభించింది. మంత్రి కందుల దుర్గేష్, జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ప్రశంసా పత్రాన్ని అందజేశారు. విధుల్లో అంకిత భావంతో సేవలు అందించినందుకు ఆమెను ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గోకవరం సిహెచ్సి వైద్యులు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు రాయవరపు శ్రీనివాసరావు, అల్లాడ అరుణ కుమారి, పిట్టా అరుణ్ , ఆసుపత్రి సిబ్బంది డాక్టర్ రామలక్ష్మి కి శుభాకాంక్షలు తెలియజేశారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు

## వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి - ఎస్సై పవన్ కుమార్



గోకవరం ఆగస్టు 16 జిఎస్బి వార్త : గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 3:00 గంటల నుండి సాయంత్రం 7:00 గంటల వరకు డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టనున్నట్లు గోకవరం ఎస్సై ఎచ్ఏ పవన్ కుమార్ ఎస్సై ఆదివారం తెలిపారు.రంపచోడవరం పర్యాటక ప్రాంతాలకు వెళ్లే పర్యాటకుల రాకపోకలు అధికంగా ఉండే నేపథ్యంలో, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రజల భద్రతను కాపాడడం మరియు మద్యం సేవించి వాహనాలు నడపడాన్ని అరికట్టడం కోసం ఈ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, అప్రమత్తంగా మరియు జాగ్రత్తగా వాహనాలు నడపాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాతో పాటు కోర్టు విధించే 2 రోజుల జైలు శిక్షకు గురికాబడతారని హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహనదారులు పోలీసులకు సహకరించాలని ఎస్.ఐ. పవన్ కుమార్ కోరారు.

# కొత్త లేబర్ కోడ్స్ తో పోరాడుదాం

## ఏపీ పేపర్ మిల్ లో మంచి అగ్రిమెంట్ చేస్తాం - కార్మికుల హక్కులను కాపాడుతాం - ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు




రాజమండ్రి, ఆగస్టు 16 జి ఎస్ బివార్త : ఏపీ పేపర్ మిల్ లో కార్మికులు మా యునైటెడ్ ఫ్రంట్ నమ్ముకుని ఓట్లు వేశారని మమ్మలని గెలిపించారని కార్మికులు అనుకునే విధంగా మంచి అగ్రిమెంట్ చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు అన్నారు ఆదివారం మధ్యాహ్నం స్థానిక గాడాల గ్రామంలో యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యం లో మానుకొండ కృష్ణ అధ్యక్షతన ఆత్మీయ సమావేశం జరిగింది ముందుగా ఎఫ్ ఐ టి యు గౌరవ అధ్యక్షులు మూర్తి మాట్లాడుతూ పేపర్ మిల్ కార్మికుల సమస్యలను గుర్తించి వారి సమస్యలను పరిష్కరించడానికి పోరాటం చేస్తామన్నారు పరంపర సమస్యలను పరిష్కరించి కార్యాచరణ రూపించస్తామని అన్నారు ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తాటిపాక మధు మాట్లాడుతూ పాలక వర్గలు కార్మిక హక్కులను హరించే విధంగా కొత్త లేబర్ కోడ్లను తీసుకు వచ్చారని అన్నారు ఈ లేబర్ కోడ్స్ అమలై తే ఉరి మాత్రమేనని అన్నారు కార్మిక సమస్యలు గుర్తించి చార్టర్ ఆఫ్ డిమాండ్స్ తయారు చేసుకుని ముందుకు వెళతామని అన్నారు ఇంకా ఈ సమావేశంలో ఏఐటీయూసీ యూనియన్ గౌరవ అధ్యక్షులు జి ఏ రామారావు, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు కె రామకృష్ణ కోరమాండల్ ఫెర్టిలేజన్ ఎంప్లీస్ యూనియన్ నాయకులు కె శ్రీనువాస్ రావు జనసేన యూనియన్ కార్యదర్శి ఆకుల ఈశ్వరరావు జే మోహన్ రావు, పై ఎఫ్ ఐ టీ యు నాయకులు ఏవీ వి శ్రీనువాస్, కాకి రమణ, ఆర్ ఎస్ నాయుడు, పేపర్ మిల్ ఎంప్లెస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ సత్తిబాబు, కె ఎస్ ఆర్ కె కిషోర్ తదితరులు ప్రసంగించారు

# రంపయర్రంపాలెం తొలి మహిళ సర్పంచ్ దంగేటి సత్యానందం మృతి



గోకవరం ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ దంగేటి సత్యానందం వెంకటేశ్వరావు ఆదివారం కన్ను మూశారు. రంపయర్రంపాలెం గ్రామ పంచాయతీకి తొలి మహిళ సర్పంచ్ గా దంగేటి సత్యానందం పనిచేశారు.ఆమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతు ఆదివారం తెల్లవారుజామున తుది శ్వాస విడిచారు. ఆమె సర్పంచ్ గా 1996 నుండి 2001 వరకు పదవి బాధ్యతలు నిర్వహించారు. ఆమె సర్పంచ్ గా గ్రామానికి అనేక అభివృద్ధి పనులు చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచారు.అమెమృతికి పలువురు రాజకీయ ప్రముఖులు గ్రామ ప్రజలు నివాళులు అర్పించారు.

# రాష్ట్ర నాట్య అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన మద్దాల యేసుపాదం...



కోరుకొండ ఆగస్టు 16 (జి ఎస్ బి వార్త) మద్దాల యేసుపాదం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాట్య అకాడమీ డైరెక్టర్‌గా నియమితులైన సందర్భంగా సీతానగరం మండలంలోని GVK ఫంక్షన్ హాల్ నందు ఆత్మీయ సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించబడింది. ఈ వేడుకకు రాజనగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, వారి సతీమణి వెంకటలక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మద్దాల యేసుపాదం ని బత్తుల బలరామకృష్ణ దంపతులు దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ, "జనసేన పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాల వ్యాప్తికి నిరంతరం శ్రమించిన సీనియర్ నాయకులు మద్దాల యేసుపాదం సేవలకు తగిన గుర్తింపు లభించింది. ప్రజాక్షేత్రంలో ఆయన చేసిన కృషికి ప్రతిఫలంగానే కూటమి ప్రభుత్వంలో వారికి ఈ బాధ్యత దక్కింది. నాట్య అకాడమీ డైరెక్టర్‌గా కళలకు, కళాకారులకు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తూ, నియోజకవర్గానికి మరింత మంచి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నాను," అని తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించినందుకు జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్కి, కూటమి పెద్దలకు మరియు తనకు నిరంతరం అండగా నిలిచిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకి మద్దాల యేసుపాదం ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి కూటమి నాయకులు, కార్యకర్తలు, వీరమహిళలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని యేసుపాదం కి అభినందనలు తెలిపారు.

# కులాల పేరుతో రాజకీయాలు చేయడం తెజపా సిద్ధాంతమా? :

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్




కాకినాడ సిటీ ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : కులాల పేరుతో వ్యక్తులను లక్ష్యంగా చేసుకోవడం, రాజకీయ లబ్ది కోసం కులాలను వాడుకోవడమే తెలుగు జనతా పార్టీ (తెజపా) విధానమా అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధికార ప్రతినిధి వుంగరాల సంతోష్ నిలదీశారు. రాజకీయ మనుగడ కోసమే తెజపా అధ్యక్షుడు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు మాజీ మంత్రి, కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజాపై అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్టీలో ఉంటూ ప్రత్యర్థి వర్గాలకు సహకరిస్తున్న కొందరు కోవర్టులను ఉద్దేశించి మాత్రమే దాడిశెట్టి రాజా హెచ్చరికలు జారీ చేశారని, అందులో ఏ కులాన్నీ లేదా వ్యక్తుల పేర్లనూ ప్రస్తావించలేదని స్పష్టం చేశారు. రాజా వ్యాఖ్యలకు కులాన్ని ఆపాదిస్తూ నియోజకవర్గాల్లో చిచ్చు పెట్టే ప్రయత్నం చేయడం సరికాదని, పూర్తి వీడియో చూస్తే వాస్తవాలు అర్థమవుతాయని పేర్కొన్నారు. పెద్దింశెట్టి ఇప్పటికైనా తన పద్ధతి మార్చుకోకపోతే వైఎస్సార్‌సీపీ శ్రేణులు తగిన రీతిలో బుద్ధి చెబుతాయని సంతోష్ హెచ్చరించారు.

# గైగోలుపాడులో సందడిగా 'ఇంటింటికి తెలుగుదేశం'

## గత అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్న ప్రజలు.. పిల్లి దంపతులకు ఆత్మీయ స్వాగతం



కాకినాడ రూరల్ ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయాలనే లక్ష్యంతో టీడీపీ చేపట్టిన 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం ఆదివారం రమణయ్యపేట పరిధిలో గైగోలుపాడు ప్రాంతాల్లో ఉత్సాహంగా సాగింది. టీడీపీ కాకినాడ రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణమూర్తి దంపతులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. ప్రతి కుటుంబంతో నేరుగా మాట్లాడిన పిల్లి దంపతులు.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక అవసరాలు, మౌలిక వసతుల పరిస్థితి, ప్రభుత్వ పథకాల అమలుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, యువత, కార్మికులు, వివిధ వర్గాల ప్రజలతో ఆత్మీయంగా ముచ్చటించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను నమోదు చేసుకుని, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని పిల్లి దంపతులు హామీ ఇచ్చారు. రమణయ్యపేట, గైగోలుపాడు ప్రాంతాల్లో పర్యటించిన సందర్భంగా పలువురు ప్రజలు పిల్లి దంపతులు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చేపట్టిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి ప్రభుత్వ భవనాలు, రహదారులు, తాగునీరు, విద్యుత్ తదితర మౌలిక వసతుల అభివృద్ధికి చేసిన కృషిని ప్రస్తావించారు. గతంలో నిర్మించిన ప్రభుత్వ భవనాలు, అభివృద్ధి చేసిన రహదారులు, ఇతర మౌలిక వసతులు ఇప్పటికీ తమ ప్రాంతానికి ఉపయోగపడుతున్నాయని పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. తమ ప్రాంత అభివృద్ధిలో పిల్లి దంపతులు పోషించిన పాత్రను గుర్తు చేసుకుంటూ వారితో తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా పిల్లి అనంతలక్ష్మి సత్యనారాయణమూర్తి దంపతులు మాట్లాడుతూ.. తమ ఎమ్మెల్యే పదవీకాలంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అనేక అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. అభివృద్ధి అనేది ఒక నిరంతర ప్రక్రియ అని, ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజల వద్దకు వెళ్లడం కాకుండా, నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తెలుసుకోవడమే తమ విధానమన్నారు. రమణయ్యపేట, గైగోలుపాడు ప్రజలు చూపుతున్న ఆప్యాయత, అభిమానానికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ప్రోత్సాహం, సామాజిక భద్రతా పథకాలు తదితర సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనం అందేలా కృషి చేస్తామని తెలిపారు. పథకాల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, క్లస్టర్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ నాయకులు, కూటమి శ్రేణులు, మహిళలు, యువత, గ్రామ పెద్దలు, రమణయ్యపేట, గైగోలుపాడు ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అడ్డతీగలలో డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలు

అడ్డతీగల,(జిఎస్ బి వార్త)ఆగస్టు16: స్థానిక అడ్డతీగల గాంధీ సెంటర్‌లో రాష్ట్ర ఓబిసి సెల్ కన్వీనర్ దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు, బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన డాక్టర్ సర్దార్ గౌతు లచ్చన్న 117వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన దేశానికి,సమాజానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా దంగేటి సత్తిబాబు మాట్లాడుతూ,డాక్టర్ గౌతు లచ్చన్న స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు బడుగు,బలహీన వర్గాల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన గొప్ప ప్రజానాయకుడని కొనియాడారు.లచ్చన్న గౌతు లచ్చన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని,ఆయన పోరాట స్ఫూర్తి సమాజానికి ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తుందని అన్నారు.



# బడుగు వర్గాల సంక్షేమానికి సర్దార్ లచ్చన్న కృషి చిరస్మరణీయం :

## ఎమ్మెల్యే వనమాడి కొండబాబు




కాకినాడ సిటీ ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : పార్టీలకతీతంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి సర్దార్ గౌతు లచ్చన్న చేసిన సేవలు చిరస్మరణీయమని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆదివారం కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సర్దార్ గౌతు లచ్చన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి, అధికారులు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, డీఆర్వో డాక్టర్ డి. తిప్పేనాయక్ మాట్లాడుతూ నాటి గంజాం జిల్లా సోంపేట తాలూకా బారువా గ్రామంలోని సాధారణ గీత కార్మిక పేద కుటుంబంలో 8వ సంతానంగా జన్మించిన లచ్చన్న, అనేక ఒడిదుడుకులను ఎదుర్కొని ఎదిగారని గుర్తుచేశారు. మెట్రిక్ చదువుతున్న రోజుల్లోనే మహాత్మా గాంధీ పిలుపుతో స్వాతంత్రోద్యమంలోకి అడుగుపెట్టి, విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో తన దుస్తులను ఆహుతి చేశారన్నారు. 1942 క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు బ్రిటీష్ ప్రభుత్వం ఆయనను ప్రమాదకరమైన వ్యక్తిగా గుర్తించి జైలులో నిర్బంధించిందని పేర్కొన్నారు. జీవితాంతం ప్రజాహిత కార్యక్రమాలకు, బడుగుల సంక్షేమానికి పాటుపడిన లచ్చన్న 2006 ఏప్రిల్ 19న తుదిశ్వాస విడిచారని వివరించారు. ?లచ్చన్న చూపిన మార్గంలో నడుస్తూ ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు. బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు చప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే వెంకటేష్, ఒమ్మి బాలాజీ, కడలి ఈశ్వరి, చొల్లంగి వేణుగోపాల్, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి ఎ. శ్యామలకుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ. శ్రీనివాసరావు, నాయకులు పాలిక నాని, పాలిక సాయి సూర్య, డి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి రూ. 1,11,116/- విరాళం



అన్నవరం, (జి ఎస్ బి వార్త), ఆగష్టు - 16 : ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం శ్రీ వీరవెంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి తిరుపతి వాస్తవ్యులు రూ. 1,11,116/- విరాళమును దేవస్థానం ఏఈఓ పాలంకి జగ్గారావు కుఅందజేసారు. ఎం. సౌమ్య ఈ విరాళం అందజేసి ప్రతీ సంవత్సరం దీనిపై వచ్చు వడ్డీతో జనవరి 10 తేదీన అన్నదానం జరిపించవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా దాతలను జగ్గారావు అభినందించి, సత్యదేవుని ఫొటో, ప్రసాదం అందజేశారు

# పరదేశమ్మ పేటలో పోలీసుల ఆకస్మిక కార్డెన్ - సెర్చ్ ఆపరేషన్

## 30 బైకులు సీజ్, రౌడీషీటర్లకు కౌన్సిలింగ్




కాకినాడ సిటీ ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : స్థానిక పరదేశమ్మ పేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఏరియాలో పోలీసులు ఆదివారం తెల్లవారుజామున 5 గంటలకు భారీ కార్డెన్ ఉ సెర్చ్ ఆపరేషన్ కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ ఆదేశాల మేరకు, కాకినాడ సబ్ డివిజన్ ఇన్‌ఛార్జ్, అడిషనల్ ఎస్పీ కిషోర్ కుమార్పర్యవేక్షణలోనిర్వహించారు.?ఈ తనిఖీల్లో వన్ టౌన్ సీఐ ఆధ్వర్యంలో సుమారు 60 మంది పోలీస్ సిబ్బంది, పోర్ట్, సర్పవరం, త్రీ టౌన్ సీఐలు, ఎస్సైలు, ఈగల్ టీమ్ మరియు స్పెషల్ పార్టీ బలగాలు పాల్గొని సరైన పత్రాలు, నంబర్ ప్లేట్లు మరియు రికార్డులు లేని మొత్తం 30 మోటార్ సైకిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక రౌడీషీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాలు నమోదు చేసుకుని, సత్ప్రవర్తనతో మెలగాలని గట్టి హెచ్చరికలతో కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈగల్ టీమ్ సహకారంతో మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై యువతకు అవగాహన కల్పించారు. రాష్ట్రాన్ని 'గంజాయి రహిత ఆంధ్రప్రదేశ్'గా తీర్చిదిద్దేందుకు యువతతో ప్రతిజ్ఞ చేయించారు. ఎవరైనా మాదకద్రవ్యాలు, గంజాయి కలిగి ఉన్నా లేదా అక్రమంగా విక్రయిస్తున్నా వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

# పెనుగుదురులో రూ. 53 లక్షల తో సొసైటీ భవన నిర్మాణం

## పనులు పరిశీలించిన ఎమ్మెల్యే పంతం నానాజీ

కరప (జిఎస్ బి వార్త) : ఆదివారం కరప మండలం పెనుగుదురు గ్రామంలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ . రూ. 53 లక్షల సొసైటీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు మాజీ మంత్రి చిక్కాల రామచంద్ర రావు , సొసైటీ అధ్యక్షులు రెడ్డిపల్లి నారాయణ రావు ,కరప మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ , మాజీ ఎంపీటీసీ తుమ్మలపల్లి మాచరావు ,నీటి సంఘం అధ్యక్షులు తుమ్మలపల్లి గోవిందరాజులు , జనసేన నాయకులు గంటా నాని బాబు , సింగంపల్లి నాగేశ్వర రావు , గుత్తుల కృష్ణమూర్తి , నల్లే ప్రసన్న కుమార్ , యాళ్ల హరినాథ్ , రెడ్డిపల్లి భాస్కర్ , అల్లు శివ , తుమ్మల సత్యనారాయణ మూర్తి , అనుకుల రాంబాబు , భవాని , రమ్య , పుణ్యమంతుల అన్నవరం కూటమి నాయకులు వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# సమస్యల సత్వర పరిష్కారానికే ప్రజా దర్బార్

### ప్రజాదర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బండారు




కొత్తపేట, ఆగస్ట్ 16,( జి ఎస్ బీ వార్త) : ప్రజల సమస్యలను తత్వరమే పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వాడపాలెం గ్రామంలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం ప్రజాదర్బార్ నిర్వహించారు నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించారు18 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారుసి సమస్యల పరిష్కారానికి ఆయా శాఖల అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు

# గోటేటి కుటుంబానికి అండగా కూటమి ప్రభుత్వం

### లోకేష్ ఆదేశాలతో అధికార యంత్రాంగం చర్యలు రూ5 లక్షలతో పక్కా ఇంటి నిర్మాణం



కొత్తపేట, ఆగస్టు 16, (జి ఎస్ బీ వార్త) : పేదల కష్టాలను గుర్తించి తక్షణమే పరిష్కరించడమే ఎన్డీఏ కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు కొత్తపేట నియోజకవర్గం అవిడి గ్రామానికి చెందిన గోటేటి రామమూర్తి కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న విషయం సోషల్ మీడియా ద్వారా మంత్రి నారా లోకేష్ దృష్టికి వెళ్లడంతో వెంటనే స్పందించి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదేశించారని తెలిపారు ఈ విషయం తన దృష్టికి వచ్చిన వెంటనే అవిడి గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం అందించి కుటుంబ పరిస్థితిని పరిశీలించి తక్షణ సహాయం అందించేలా చర్యలు చేపట్టినట్లు ఎమ్మెల్యే వివరించారు గత కొంతకాలంగా గ్రామ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రామకృష్ణ తదితరులు రామమూర్తి కుటుంబానికి నిత్యావసర సరుకులు కూరగాయలు వంటి సహాయాన్ని అందిస్తూ వస్తున్నారని తెలిపారు కుటుంబానికి ప్రధాన సమస్యగా ఉన్న విద్యుత్ సౌకర్యాన్ని అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి 24 గంటల వ్యవధిలోనే అందుబాటులోకి తీసుకొచ్చారని ఎమ్మెల్యే చెప్పారు విద్యుత్ లైన్ నుంచి సరఫరా తీసుకువచ్చి అవసరమైన చోట కొత్తగా ఏడు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్ కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు అదేవిధంగా కుటుంబానికి శాశ్వత నివాసం కల్పించేందుకు రూ 5 లక్షల వ్యయంతో పక్కా ఇంటి నిర్మాణం చేపట్టేందుకు హౌసింగ్ శాఖ అధికారులు చర్యలు ప్రారంభించారని చెప్పారు పి4 పథకం కింద ఇంటి నిర్మాణానికి అవసరమైన గణాంకాలు సిద్ధం చేసి పనులు ప్రారంభించే ప్రక్రియను చేపట్టారని సుమారు రెండు నెలల్లో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు ఇంటికి అటాచ్డ్ బాత్‌రూమ్ సదుపాయం కూడా కల్పించనున్నట్లు చెప్పారు కుటుంబానికి ప్రస్తుతం అందుతున్న రూ 4 వేల పెన్షన్‌తో పాటు వారు అర్హత పొందే ఇతర సామాజిక భద్రతా పింఛన్లపై కూడా అధికారులు పరిశీలన చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు కుటుంబానికి ఎదురవుతున్న హౌస్‌హోల్డ్ సమస్యను పరిష్కరించి అర్హత మేరకు దివ్యాంగుల పెన్షన్ లేదా సీరియస్ ఇల్‌నెస్ పెన్షన్ అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు కుటుంబానికి గ్యాస్ స్టవ్ సిలిండర్ వంట పాత్రలు ఫర్నిచర్ తదితర అవసరమైన సామగ్రిని కూడా సమకూర్చినట్లు తెలిపారు సుమారు రూ30 వేల నుంచి రూ40 వేల విలువైన సామగ్రిని అందించడంతో పాటు కొంతమంది దాతలు కూడా ముందుకు వచ్చి కుటుంబానికి సహాయం చేస్తున్నారని చెప్పారు

# కంబాల దంపతులను ఘనంగా సత్కరించిన చాగంటి...



కోరుకొండ ఆగస్టు 16 (జి ఎస్ బి వార్త) తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి జూపూడి సరోజినీ దేవి కళా ప్రాంగణంలో శనివారం సాయంత్రం ప్రారంభమైన సంగీత నృత్యోత్సవ సప్తాహం కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యారు. అలాగే ఎమ్మెల్సీ సోమరాజు విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ–1 కంబాల శ్రీని వాసరావు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. తొలిత కంబాల శ్రీనివాసరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ సోము వీర్రాజు కంబాల శ్రీనివాసరావు ప్రసంగించారు. తదుపరి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు గారు గొప్ప ప్రవచనాలను ప్రజలకు ప్రసంగించారు. కార్యక్రమం అనంతరం ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలు, ఆలయాల అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమానికి విశిష్ట కృషి చేస్తున్న కంబాల శ్రీనివాసరావు సేవలను మెచ్చి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరావు స్వయంగా కంబాల శ్రీనివాసరావు సేవలను అడిగి తెలుసుకొని కంబాల దంపతులను శాలువా కప్పి, సత్కరించి, వెంకటేశ్వర స్వామి ప్రతిమను అందజేసారు. కంబాల శ్రీనివాసరావు సేవలను అభినందించి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ తమకు దక్కిన ఈ అరుదైన గౌరవం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేశారు. చాగంటి కోటేశ్వరరావు గారు స్వయంగా తమకు ఆశీస్సులు అందించడం, తమకు అరుదైన గౌరవం దక్కడం నిజంగా మహద్భాగ్యం. ఇది జీవితంలో మరుపురాని మధురమైన ఘట్టమని, సేవలను గుర్తించి ఇంతటి గౌరవం అందించడం ఎంతో గర్వకారణం ఉందన్నారు. బి ఈ గౌరవం వ్యక్తిగత ఆనందం మాత్రమే కాదని, భవిష్యత్తులో మరింత అంకితభావంతో ప్రజాసేవ చేయాల్సిన బాధ్యతను పెంచిందన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు 4 గురిపై కేసులు నమోదు

గోకవరం ఆగస్టు 16 జి ఎస్ బి వార్త : మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా జరిగే రోడ్ ప్రమాదాలను అరికట్టేందుకు ఆదివారం ఎస్సై బి. నాగమణి ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌పై ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై వి.ఎన్.వి. పవన్ కుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం పర్యాటక ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు అధికంగా ఉండటంతో, రోడ్డు ప్రమాదాలను నివారించడం మరియు ప్రజల భద్రతను కాపాడే ఉద్దేశంతో ఈ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. దీనిలో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 4 గురిని గుర్తించగా, వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు, వారిని కోర్టులో హాజరుపరిచి జరిమానాతో జైలు శిక్ష విధించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు సంభవించి అమాయకుల ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, ఎల్లప్పుడూ అప్రమత్తంగా మరియు జాగ్రత్తగా వాహనాలు నడపాలని పోలీసులు సూచించారు.



# 16,050 కిలోల అక్రమ పీడీఎస్ బియ్యం పట్టివేత




రాజమహేంద్రవరం (జిఎస్ బి వార్త) : రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు సమీపంలోని గామన్ బ్రిడ్జి వద్ద శనివారం సాయంత్రం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, రెవెన్యూ సిబ్బంది సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో అక్రమంగా రవాణా చేస్తున్న 16,050 కిలోల పీడీఎస్ బియ్యాన్ని అధికారులు పట్టు కుని సీజ్ చేశారు. ఐచర్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని అధికారులు సీజ్ చేశారు. అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని రవాణా చేస్తున్న వ్యక్తులపై రాజానగరం పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు రాజమహేంద్రవరం రూరల్ సివిల్ సప్లైస్ డిప్యూటీ తాసిల్దార్ సూర్య ప్రభాకర్ తెలిపారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# ఇంటింటికి కూటమి విజయగాథలు

### ప్రజలకు రెండేళ్ల సుపరిపాలన వివరించిన మంత్రి సుభాష్



కాజులూరు:(జిఎస్ బి వార్త) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను ప్రజలకు వివరించే లక్ష్యంతో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కాజులూరు మండలం ఆండ్రంగి గ్రామంలో ఇంటింటా ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో రాష్ట్రంలో పారదర్శకమైన, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసే పాలన కొనసాగుతోందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. మహిళలు, రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, వృద్ధుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, ఉపాధి అవకాశాల కల్పన వంటి అంశాల్లో కూటమి ప్రభుత్వం విశేష పురోగతి సాధించిందన్నారు. రెండేళ్ల కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల ఫలితాలు నేరుగా ప్రజలకు చేరుతున్నాయని, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సుభాష్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చవ్వాకుల నారాయణమూర్తి, కూటమి పార్టీ నాయకులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గన్నవరానికి సింగిల్ ఇన్‌చార్జి నియామకంపై ఏకగ్రీవ తీర్మానం

### మంత్రి వాసంశెట్టి సుభాష్



అమలాపురం, ఆగస్టు 16:(జిఎస్ బి వార్త) : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సమగ్ర అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, భవిష్యత్ కార్యాచరణపై జిల్లా ఎమ్మెల్యేల ఆత్మీయ సమావేశం అమలాపురంలోని స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగింది. కోనసీమ జిల్లాకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి, ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని సమావేశం తీర్మానించింది. ఈ సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కోనసీమ అభివృద్ధి మనందరి ఉమ్మడి బాధ్యత. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రతి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే మన లక్ష్యం అని అన్నారు. నెలకోసారి ఒక ఎమ్మెల్యే గృహంలో ఆత్మీయంగా సమావేశమై, నియోజకవర్గాల వారీగా ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలు, భవిష్యత్ కార్యాచరణపై సమీక్షించటం శుభ పరిణామమని మంత్రి తెలిపారు. గోదావరి నదీ పరివాహక ప్రాంతమైన కోనసీమలోని చెరువులు, పంట కాలువలు, సాగునీటి వనరుల్లో పెద్దఎత్తున పూడిక పేరుకుపోవడంతో సాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమావేశం గుర్తించింది. గత వైసీపీ ప్రభుత్వం పంట కాలువలపై అభివృద్ధి పనులు చేపట్టలేదని విమర్శించారు. ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన కాకుండా కోనసీమకు ప్రత్యేకంగా నిధులు కేటాయించి చెరువులు, పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలని తీర్మానించారు. దీంతో పంట కాలువల్లో నీటి ప్రవాహం మెరుగుపడి, రైతులకు సాగునీటి ఇబ్బందులు తగ్గుతాయని సమావేశం అభిప్రాయపడింది. ఈ తీర్మానాలను పార్టీ అధిష్టానానికి పంపుతామన్నారు.

గన్నవరానికి సింగిల్ ఇన్‌చార్జి నియామకంపై తీర్మానం : గన్నవరం నియోజకవర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న టూ మెన్ కమిటీ స్థానంలో ఒకే సింగిల్ ఇన్‌చార్జిని నియమించాలని సమావేశంలో కీలకంగా చర్చించి తీర్మానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీని మరింత బలోపేతం చేయడానికి, నాయకులు--కార్యకర్తలను సమన్వయం చేసేందుకు సింగిల్ ఇన్‌చార్జి వ్యవస్థ మరింత ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రజల నుంచి వస్తున్న ఇళ్ల స్థలాలు, కొత్త పింఛన్లు, ఇతర సంక్షేమ పథకాలకు సంబంధించిన వినతులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సమావేశం నిర్ణయించింది. ప్రజలు మన దగ్గరకు వచ్చే వరకు వేచి చూడకుండా.. మనమే ప్రజల వద్దకు వెళ్లాలి. ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారం చూపించాలి. ప్రజల విశ్వాసమే మన బలం అని అన్నారు.

భవిష్యత్ అభివృద్ధిపై సమగ్ర కార్యాచరణ : డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రహదారులు, సాగునీరు, డ్రైనేజీ, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల అభివృద్ధిపై భవిష్యత్‌లో చేపట్టాల్సిన కార్యక్రమాలను సమావేశంలో చర్చించారు. ప్రతి నియోజకవర్గానికి అవసరమైన ప్రాధాన్యతా పనుల జాబితాను రూపొందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. కోనసీమను అభివృద్ధికి ఆదర్శంగా నిలపాలి. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడమే ప్రధాన లక్ష్యం. అభివృద్ధి విషయంలో అందరం ఒకే మాటపై ముందుకు సాగాలని మంత్రి సుభాష్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, వేగుళ్ల జోగేశ్వరరావు, బండారు సత్యానందరావు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా టీడీపీ అధ్యక్షులు గుత్తుల సాయి, జిల్లా ప్రధాన కార్యదర్శి గంధం పళ్లం రాజు, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జి గొల్లపల్లి అమూల్య, గన్నవరం టూ మెన్ కమిటీ సభ్యులు మోకా ఆనందసాగర్, దాసరి వీర వెంకట సత్యనారాయణ, అముడా చైర్మన్ అల్లాడి స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం మిరియం డిగ్రీ కాలేజీ లో 19న మెగా జాబ్ మేళా

అమలాపురం (జిఎస్ బి వార్త) : జిల్లా ఉపాధి కార్యాలయం వారి ఆధ్వర్యంలో అమలాపురం లో మిరియం డిగ్రీ కాలేజ్ నందు ఆగస్టు 19వ తారీఖున మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఉపాధి అధికారి ఆర్. వహీదా గారు పత్రికా విలేకరులకు తెలిపారు. ప్రముఖ 10 కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని కావున 18 – 35 సంవత్సరాల వయసు కలిగిన పురుష, మహిళ అభ్యర్థులు అర్హులని కంపెనీల నియమాలను అనుసరించి ఎంపిక చేస్తారని, నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఆసక్తి ఉన్నవారు ఈ కింది లింక్ లో రిజిస్ట్రేషన్ చేసుకుని ఇంటర్వ్యూ కు హాజరు కాగలరు. https://naipunyam.ap.gov.in మరిన్ని వివరాలు కోసం క్రింది నెంబర్లకు సంప్రదించాలని తెలిపారు. 9000831156, 9380808275 9988853335, 8712655686

# వేళంగి లో 20ఏళ్ల గా విద్యార్థులకు నాణ్యత గల మిడ్ డే మీల్స్

### సత్కరించిన గ్రాడ్యుయేట్ యూత్



కరప,వేళంగి, ఆగస్టు 16:(జిఎస్ బి వార్త) : వేళంగి గ్రామంలోని మెర్లాస్ జిల్లా పరిషత్ పాఠశాలలో సుమారు 20 ఏళ్ల గా మధ్యాహ్న భోజన పథకం (ఎం డి ఎం ) నిర్వహిస్తూ విద్యార్థులకు సేవలందిస్తున్న పట్నాల వెంకటలక్ష్మి--సూరిబాబు ని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న ఘనంగా సన్మానించారు. వేళంగి గ్రాడ్యుయేట్స్ యూత్ మెర్లాస్ జిల్లా పరిషత్ స్కూల్ హెచ్ఎం త్రిమూర్తులు గారి ఆధ్వర్యం సత్కరించారు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యత తో అందించడంలో దీర్ఘకాలంగా సేవలను గుర్తించి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మెర్ల వీరయ్య చౌదరి, బొండా వెంకన్నారావు, బొడ్డు భాస్కర్ రామన్, పాతూరి వీర్రాజు, సవిలే రాజేష్,మెడిశెట్టి పట్టాభి యూత్ ప్రతినిధులు నక్కిళ్ళ వేణుగోపాల్, పట్నాల శ్రీమంత్,ఎర్ర విక్రమ్ తదితరులతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# హరిత కాకినాడ కు మొక్కలు నాటిన

### ఆల్ ఈజ్ వెల్ స్వచ్ఛంద సేవా సంస్థ



కాకినాడ, (జి ఎస్ బి వార్త ) : స్థానిక పళ్ళంరాజు నగర్ లో ఆల్ ఈజ్ వెల్ సభ్యుల చే మొక్కలు నాటే కార్యక్రమాన్ని విజయవంతం గా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకులు కిషోర్ మాట్లాడుతూ "కాకినాడను పచ్చని, అందమైన నగరంగా తీర్చిదిద్దడంలో ఈ సంస్థ నిరంతరం శ్రమిస్తోంది అని,మా సంస్థ కు అటవీశాఖ వారిచే వంద మొక్కలు వచ్చాయని ఇవి మన కాకినాడ లోని పలు చోట్ల వేయడానికి సంకల్పించామని, మన నగరాన్ని హరిత నగరం గా తయారుచేయడానికి కృషి చేస్తున్నమని అన్నారు. ఆల్ ఈజ్ వెల్ సభ్యులు ,దంత వైద్యులు డా అడ్డాల మాట్లాడుతూ "మన కాకినాడ లో ఉన్న పలు కళాశాలల విద్యార్థుల తో మేము ఏర్పాటు చేసిన జెన్ గ్రీన్ మంచి ఫలితాలు ఇస్తుందని, మానవులకు వృక్షాలు అవసరమైన ప్రాణవాయువును (ఆక్సిజన్) అందించి, కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకుంటాయని, భూగోళ వేడి తగ్గించడంలోనూ, సరైన సమయంలో వర్షాలు పడటంలోనూ చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని, మన ఉప ముఖ్య మంత్రి,అటవీశాఖ మంత్రి,శ్రీ పవన్ కళ్యాణ్ అందిస్తున్న స్పూర్తి తో, పచ్చని వాతావరణాన్ని అందించాలనే సంకల్పంతో "ఆల్ ఈజ్ వెల్" సభ్యులు చేస్తున్న ఈ నిరంతర కృషి కాకినాడ నగరవాసులందరికీ ఎంతో స్ఫూర్తిదాయకం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజకుమార్, కార్యదర్శి శ్రీ టి.వి. వి . ఎస్. ఎన్ రెడ్డి, డాక్టర్ రవివర్మ ,విక్రమ్ , శ్రీ రాజేంద్ర, శ్రీ శ్రీనివాసు , శ్రీ వెంకటనారాయణ, సీనియర్ సిటిజన్లు శ్రీ కరి నాగభూషణం , శ్రీ కృష్ణారావు , శ్రీ స్వామి తదితరులు పాల్గొన్నారు. సుమారు 30 మంది జెన్ గ్రీన్ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొని వారి సేవలు అందించారు.

# పర్యావరణానికి భారంగా ప్లాస్టిక్ - డాక్టర్ రాఘవేంద్రరావు



కాకినాడ, (జిఎస్ బి వార్త ) ప్రతిరోజు మనం వినియోగించే వస్తువులలో ప్లాస్టిక్ ఒక పెద్ద భారంగా మారిందని రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ రాఘవేంద్రరావు పేర్కొన్నారు .స్థానిక బోటు క్లబ్ ఉద్యానవనంలో వాకర్స సంఘం ఆధ్వర్యంలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచులు సౌకర్యంగా ,తక్కువ ధర, తేలికైన ఉపయోగం కారణంగా వాటి వినియోగం అంతకంతకు విపరీతంగా పెరిగిందని అన్నారు. అయితే దీని పరిణామాలు పర్యావరణానికి తీవ్రమైన ముప్పుగా మారాయని అన్నారు .వాకర్స్ సంఘ అధ్యక్షుడు అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ కాకినాడ నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా ఉంచేందుకు నగరపాలక సంస్థ అధికారులు విశేష కృషి చేస్తున్నారని అన్నారు .ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతగా పరిశుభ్రత పాటించి అధికారులకు సహకరించాలని అన్నారు. తొలితగా క్లబ్బు కోశాధికారి ప్రసాద్ నాయుడు ఇందుగుల, ప్రతినెల మూడవ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకు శ్రమదానం చేస్తామని స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ దాసరి శ్రీధర్ ,చింతపల్లి సుబ్బారావు, వెంకటరమణ, గోపి ,విశ్వం, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టడుగు వర్గాల సంక్షేమానికి సర్దార్ లచ్చన్న ఎంతో కృషి చేశారు

కాకినాడ, ఆగస్ట్ 16:(జిఎస్ బి వార్త) : పార్టీలతో ఎటువంటి సంబంధం లేకుండా బడుగు వర్గాల సంక్షేమానికి సర్దార్ గౌతు లచ్చన్న ఎంతో కృషి చేశారని ఆయన ఆశయాలు అమలుకు కృషి చేయాలని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు) పేర్కొన్నారు. ఆదివారం సర్దార్ గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా కాకినాడలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతు లచ్చన్న జీవిత విషయాలను డిఆర్ఓ డాక్టర్ డి తిప్పే నాయక్ సభికులకు తెలియజేశారు. ఆయన నాటి గంజాం జిల్లా సోంపేట తాలూకా బారువా గ్రామంలో ఒక సాధారణ పేద కుటుంబానికి 8వ సంతానంగా జన్మించారన్నారు. గీత వృత్తి చేసే కుటుంబంలో అందరూ అదే వృత్తి చేయడంతో పిల్లల్ని చదువు కోసం బడిలోకి పంపేవారు కాదన్నారు. మెట్రిక్ చదువుతుండగా గాంధీజీ పిలుపుకు అందుకని స్వతంత్ర ఉద్యమంలో చేరి విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో తన దుస్తులను ఆహుతి చేశారన్నారు. అలా ఎన్నో ప్రజాహిత కార్యక్రమాల్లో నిర్వహించడమే కాకుండా స్వతంత్ర ఉద్యమంలో తన వంతు పాత్ర నిర్వహించారన్నారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్న లచ్చన్నను ప్రభుత్వం ప్రమాదమైన వ్యక్తిగా గుర్తించి జైలులో ఉంచిందన్నారు. స్వతంత్ర ఉద్యమంలో ఎన్నో పోరాటాలు చేసిన లచ్చన్న 2006 ఏప్రిల్ 19 చనిపోయాడని చెప్పారు. అందరూ ఆయన ఆశయాలకు అనుగుణంగా పనిచేసి మన్ననలు పొందాలని వనమాడి సూచించారు. అంతకు ముందు ఆయన చిత్రపటానికి వేసి నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు చప్పిడి వెంకటేశ్వరరావు, పెంకే వెంకటేష్, ఒమ్మి బాలాజీ, కడలి ఈశ్వరి, చొల్లంగి వేణుగోపాల్, జిల్లా బిసి సంక్షేమ శాఖ అధికారిని ఎ శ్యామల కుమారి, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ శ్రీనివాసరావు, పాలిక నాని, పాలిక సాయి సూర్య, డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# జలుబు, దగ్గు, వైరల్ ఇన్ఫెక్షన్ సమస్యల్ని తగ్గించే అల్లం మిఠాయి చిట్కా

సీజనల్ వ్యాధులు జలుబు, దగ్గు, జ్వరంతో చాలా మంది బాధపడుతున్నారు. వర్షాకాలంలో తేమ వాతావరణం కారణంగా వైరల్ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతున్నాయి. ఈ సమస్యలకు చెక్ పెట్టేందుకు అల్లం క్యాండీ మంచి ఆప్షన్ అంటున్నారు ఆయుర్వేద నిపుణులు. తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు జోరుగా కురుస్తున్నాయి. వర్షాల కారణంగా సీజనల్ వ్యాధులు ఎక్కువైపోయాయి. చాలా మంది దగ్గు, జలుబు, జ్వరం వంటి వైరల్ ఇన్ఫెక్షన్ లక్షణాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. వాతావరణంలో తేమ ఉన్నప్పుడల్లా, సీజనల్ జ్వరం లేదా వైరల్ ఇన్ఫెక్షన్ కేసులు పెరుగుతాయి. వర్షాకాలంలో తేమ వాతావరణం ఎక్కువగా ఉంటుంది. అందుకే ఇన్ఫెక్షన్ కేసులు వేగంగా వ్యాపిస్తున్నాయి. చాలా మంది జలుబు, దగ్గు వంటి సమస్యలకు ఇంటి నివారణలు ఉపయోగిస్తారు. అలాంటి ఇంటి చిట్కాల్లో అల్లం ఒకటి. అల్లం రసాన్ని తీసుకుంటే జలుబు, దగ్గు సమస్యల నుంచి రిలీఫ్ లభిస్తుంది. కానీ అల్లం రుచి చాలా మందికి నచ్చదు. ఇలాంటి వారికి అల్లం మిఠాయి చిట్కా బాగా పనిచేస్తుంది. ఇది తినడానికి రుచిగా ఉండటంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుంది. అల్లం క్యాండీ రెసిపీని హెబ్బర్స్ కిచెన్ అనే యూట్యూబ్ ఛానెల్‌లో షేర్ చేశారు. ఇంట్లోనే అల్లం మిఠాయి ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం.



అల్లం మిఠాయికి కావాల్సిన పదార్థాలు

అల్లం – 200 గ్రాములు, బెల్లం – 300 గ్రాములు, పసుపు – చిటికెడు

ఉప్పు – రుచికి తగినంత, పూత కోసం – కాస్తా కొబ్బరి చక్కెర పొడి

తయారీ విధానం

అల్లం క్యాండీ కోసం ముందుగా అల్లం తొక్క తీసి బాగా కడగండి. ఆ తర్వాత అల్లాన్ని తురుముకోవాలి. అల్లం అంతా తురిమిన తర్వాత.. దానికి బెల్లం యాడ్ చేయండి. ఇప్పుడు అల్లం, బెల్లాన్ని కలిపి మిక్సీలో రుబ్బుకోవాలి. ఆ తర్వాత ఈ మిశ్రమాన్ని ఉడికించాలి. ఇందుకోసం ఒక పాన్ తీసుకుని గ్యాస్ మీద ఉంచండి. పాన్ వేడిగా ఉన్నప్పుడు ఈ మిశ్రమాన్ని జోడించండి. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని బాగా కలుపుతూ రెండు నుంచి మూడు నిమిషాలు ఉడికించాలి. ఆ తర్వాత కొంచెం ఉప్పు, పసుపు వేసి 3–4 నిమిషాలు ఉడికించాలి. మిశ్రమాన్ని బాగా కలపండి. అది చేతికి అంటుకుంటే మిశ్రమం ఉడికిందని అర్థం ఇప్పుడు ఈ మిశ్రమాన్ని ఒక ప్లేటులోకి తీసుకోండి. ఆ తర్వాత చల్లారనివ్వండి. చల్లారని తర్వాత మీకు నచ్చిన ఆకారంలో చిన్న చిన్న క్యాండీలు చేసుకోవచ్చు. మీరు కావాలనుంటే పై కోటింగ్ కోసం కొబ్బరి పొడి, చక్కర కలిపి వాడుకోవచ్చు. ఈ రెండింటిని కలిపి.. క్యాండీపై పూత అప్లై చేసుకోవచ్చు. చివరగా గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయండి.

అల్లం క్యాండీతో చేసే మేలు : అల్లం యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది వైరస్, బ్యాక్టీరియా ఇన్ఫెక్షన్ల బారి నుంచి మిమ్మల్ని రక్షిస్తుంది. ఈ క్యాండీని రోజూ తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు సమస్యలు నయం అవుతాయి. వర్షాకాలంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఇన్ఫెక్షన్ల బారిన పడే ప్రమాదం ఉంటుంది. అయితే, అల్లం, బెల్లం కలిపిన క్యాండీ తీసుకోవడం వల్ల ఇమ్యూనిటీ పవర్ మెరుగుపడుతుంది. దీంతో, వ్యాధుల్ని తట్టుకునే శక్తి వస్తుంది.

జీర్ణక్రియ మెరుగుపడుతుంది : వర్షాకాలంలో జీర్ణ సమస్యలు తరచుగా ఇబ్బంది పెడతాయి. అలాంటి పరిస్థితుల్లో అల్లం క్యాండీ మేలు చేస్తుంది. అల్లం క్యాండీ తీసుకోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. ప్రతి రోజూ మీ ఆహారంలో దీనిని తీసుకోవడం వల్ల అపానవాయువు, గ్యాస్, ఆమ్లత్వం వంటి సమస్యల నుంచి బయటపడవచ్చు. అంతేకాకుండా జీర్ణ సమస్యలు ఉన్నవారికి ఇది మంచి ఆప్షన్ అంటున్నారు నిపుణులు.

ఇతర ప్రయోజనాలు : డయాబెటిస్ రోగులకు కూడా అల్లం క్యాండీ చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. అల్లంలో శోథ నిరోధక లక్షణాలు ఉంటాయి. ఇది రక్తంలో చక్కెరను నియంత్రిస్తుంది. డయాబెటిస్‌కు సంబంధించిన ఇతర సమస్యల్ని నిర్వహించడంలో మేలు చేస్తుంది.

అల్లంలో శోథ నిరోధక లక్షణాలు ఉంటాయి. ఆర్థరైటిస్ నొప్పి, వాపు నుంచి ఉపశమనం కలిగించడంలో సాయపడుతుంది. ఇది కండరాల నొప్పి నుంచి రిలీఫ్ కూడా అందిస్తుంది. వాత, కఫ దోషాల వల్ల తలెత్తే సమస్యల్ని తొలగించడంలో అల్లం ప్రభావవంతంగా ఉంటుంది. చివరగా అల్లం ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. అయితే, ఏదైనా ఆరోగ్య సమస్యతో బాధపడేవారు నిపుణుడ్ని సంప్రదించి తీసుకోవడం మంచిది.

# సాదా సీదాగా కరప మండలం సర్వ సభ్య సమావేశం





కరప (జిఎస్ బి వార్త) కరప మండలం సర్వ సభ్య సమావేశం సాధసీదాగా ముగించారు. ఆదివారం కరప ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు అధ్యక్షతన జరిగిన సమావేశం కు జడ్పీటీసీ యాళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ జె శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలు శాఖ లు నివేదిక అందించారు. సర్పంచ్ లు లేని కారణం గా గ్రామాల్లో సమస్యలు చెప్పే నాధుడు లేకుండా పోయారు. ఎంపీటీసీ లకు, జడ్పీటీసీ లకు ప్రభుత్వం గౌరవ వేతనం మంజూరు చేయాలని గ్రీవెన్స్ లో పిర్యాదు చేయడం మినహా అధికారులు ఆవిధంగా స్పందించలేదు. ఈ కార్యక్రమం లో డిప్యుటీ ఎంపీడీఓ లు సలాది శ్రీనివాస్ రావు, కర్రి శ్రీనివాస్ రావు,ఎంపీడీఓ కార్యాలయం అడ్మిన్స్ట్రేషన్ అధికారి నరసింహారావు, ఆర్ ఐ పవన్ వివిధ శాఖ లు అధికారులు, కార్యదర్శి లు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవం



**జనవరి 26 నాడు జెండా ఎగరవేయడానికి మరియు ఆగస్ట్ 15 నాడు జెండా ఆవిష్కరించడానికి తేడా ఏంటో తెలుసా..?**

**ఖచ్చితంగా అన్నీ తెలిసిన మేధావులం.. తెలిసి తప్పు చేయొద్దు తెలవకపోతే తెలుసుకొని సరిదిద్దుదాం.. మరచిపోవద్దు.**

ఆగస్టు 15, 1947న స్వేచ్ఛావాయువులు పీల్చుతూ భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. అందుకే, ప్రతి ఏటా ఈ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ తేదీన దేశవ్యాప్తంగా జెండా ఎగురవేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు.

అలాగే 1950 జనవరి 26న దేశంలో రాజ్యాంగం అమలులోకి రాగా.. ప్రతి ఏటా ఈ తేదీని గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ రోజున దేశవ్యాప్తంగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం.

అయితే ఆగస్టు 15న జెండా ఎగరవేయడానికి.. జనవరి 26న జెండా ఆవిష్కరించడానికి మధ్య చిన్న తేడా ఉంది.

ఆ తేడా ఏమిటో తెలుసుకుందాము.

ప్రతి సంవత్సరం ఆగస్టు 15న దేశ ప్రధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జాతీయ జెండాను ఎగురవేస్తారు.

ఆగస్ట్ 15 రోజున, జాతీయ పతాకాన్ని స్తంభం దిగువన కడతారు. బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిందని సూచించడానికి త్రివర్ణ పతాకాన్ని పైకి లాగుతారు.

మొదటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున బ్రిటిష్ దేశ జెండాను క్రిందికి దింపుతూ మన దేశ జెండాను పైకి ఎగురవేశారు. స్వాతంత్ర్యం వచ్చిందని తెలియజేయడానికి ఇలా త్రివర్ణ పతాకాన్ని పైకి లాగి ఎగురవేస్తారు. ఇది కొత్త దేశ ఆవిర్భావానికి ప్రతీకగా నిలుస్తుంది.

గణతంత్ర దినోత్సవం జనవరి 26 నాడు రాష్ట్రపతి జెండాను ఆవిష్కరిస్తారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని పైభాగంలో కట్టి, పైకి లాగకుండా విప్పుతారు. ఇలా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం ద్వారా ఇప్పటికే దేశం స్వతంత్రంగా ఉందని తెలియజేస్తారు.

ఈ రెండు తేదీలలో జెండాను రెపరెపలాడిస్తారు.

(గమనిక: జనవరి 26 నాడు జెండాను already కర్ర/పోల్ కి పైన కట్టి ఉంచుతాము. ఆగస్ట్ 15 తేదీన జెండాను కింది నుండి పైకి లాగుతాము అనేది గమనించాలి).

దేశ పౌరుల ప్రతినిధి, భారత పార్లమెంటుకు ప్రజలచే నేరుగా ఎన్నికైన దేశ ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవం రోజున జండా ఎగురవేయడానికి.. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రపతి జెండాను ఆవిష్కరించడానికి ఒక కారణం ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన సమయం నాటికి భారత రాజ్యాంగం అమలులోకి రాలేదు. అప్పటికి రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి పదవి చేపట్టలేదు. దీంతో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీన రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి రిపబ్లిక్ డే నాడు మహోన్నత జెండాను ఆవిష్కరిస్తారు.

అయితే ఇక్కడ గమనించాల్సిన వ్యత్యాసం ఏమిటంటే..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి జెండాను ఎగురవేస్తారు (Flag Hoisting). గణతంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి జెండాను ఆవిష్కరిస్తారు (Flag Unfurling). ఇంకొక వ్యత్యాసం ఏమిటంటే .. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వేడుకలు రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరుగుతాయి.

స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్ట్ 15 నాడు జెండా ఎగురవేసే కార్యక్రమం ఎర్రకోటలో జరుగుతుంది. గణతంత్ర దినోత్సవం జనవరి 26 నాడు రాజ్‌పథ్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది. ఈ విషయం ఇప్పటికీ చాలా మంది ఈ దేశ పౌరులకు తెలియదు.(చదువుకున్న వాళ్లకు కూడా చాలా వరకు తెలియదు). కావున ఈ information ను share చేసి మన వాళ్లకి అవగాహన కల్పించడం మన బాధ్యతగా భావించండి. ముఖ్యంగా విద్యార్థులకు తెలియజేస్తారని ఆశిస్తున్నాను.

**రేపటి తరానికి బతుకు, భద్రతలతో పాటు భారతీయత కూడా నేర్పండి.**

– సేకరణ

# ఉదయం నిద్ర లేవగానే మీకు బాడీ పెయిన్స్ ఎందుకు వస్తాయో తెలుసా?





చాలా మందికి ఉదయం నిద్రలేచిన తర్వాత శరీరంలో నొప్పులు ఉన్నట్టు అనిపిస్తుంది. కొంతమందికి మెడ నొప్పి ఉంటే.. మరికొందరికి నడుము నొప్పి. ఇంకొందరు కాళ్ల నొప్పులు అని చెబుతుంటారు. మొదట్లో ఈ నొప్పి తక్కువగా ఉంటుంది. కానీ రోజురోజుకూ ఈ నొప్పి భరించలేనిదిగా మారుతుంది. ఈ నొప్పి వెనుక జీవనశైలికి సంబంధించిన అనేక కారణాలు ఉండవచ్చు. అంతేకాకుండా కొన్ని వ్యాధులు ఉన్నా.. ఉదయం నిద్రలేవగానే శరీరంలో నొప్పులు అనిపిస్తాయి. అసలు ఉదయం లేవగానే బాడీ పెయిన్స్ ఎందుకొస్తాయో తెలుసుకుందాం. ఉదయంతో కొత్త రోజు ప్రారంభమవుతుంది. మంచి నిద్ర తర్వాత.. ప్రతి ఒక్కరూ రోజును ఉత్సాహంగా ప్రారంభించాలని కోరుకుంటారు. అయితే, రాత్రి తగినంత నిద్రపోయిన తర్వాత కూడా.. ఉదయం లేచిన వెంటనే బాడీ పెయిన్స్ వస్తున్నాయని కొందరు కంప్లైంట్ చేస్తుంటారు. మీరు మేల్కొన్నప్పుడు కూడా బాడీ పెయిన్స్ వస్తే ఇందుకు అనేక కారణాలు ఉండవచ్చు. ఇంకొందరు ఉదయం నిద్రలేచినప్పుడు కండరాలు బిగుసుకుపోవడంతో బాధపడుతుంటారు. జీవనశైలిలో మార్పులు, చెడు ఆహారపు అలవాట్లు ఇందుకు కారణమని చాలా మంది అనుకోవచ్చు. అయితే, వేరే కారణాలుయన్నాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఉదయం లేచిన వెంటనే బాడీ పెయిన్స్ ఎందుకు వస్తున్నాయో తెలుసుకోవాలి. ఆ పూర్తి వివరాలు ఇప్పుడు తెలుసుకుందాం.

తప్పుగా నిద్రించే భంగిమలు శరీరంలో చాలా నొప్పి, తిమ్మిరిని కలిగిస్తాయి. కడుపుని వెల్లకిలా ఉంచి పడుకోవడం మంచి పద్ధతి కాదు. నిపుణుల ప్రకారం ఇది ఆరోగ్యానికి చెడ్డ భంగిమ. వెన్నెముకకు చాలా ఇబ్బంది కలిగిస్తుంది. ఈ పొజిషన్‌లో పడుకుంటూ.. రాత్రి నిద్రవేళలో శ్వాస తీసుకోవడానికి తలను ఒక వైపుకు తిప్పితే అనేక ఇబ్బందులు వస్తాయి. రాత్రంతా మీ మెడను వంచి ఉంచడం వల్ల కండరాల ఒత్తిడి పెరుగుతుంది. దీంతో, మెడ నొప్పి వస్తుంది. శరీరంలో వాపు నొప్పికి కారణమవుతుంది. రోగనిరోధక వ్యవస్థ శోథ కణాలతో పాటు సైటోకిన్‌లను విడుదల చేస్తుంది. ఇవి బ్యాక్టీరియా, ఇతర ఇన్వాసివ్ ఏజెంట్‌లను బంధించడానికి లేదా గాయపడిన కణజాలాన్ని నయం చేయడానికి పనిచేస్తాయి. ఇలా పనిచేసే సమయంలో ప్రతిచర్యను ప్రారంభిస్తాయి. ఇది నొప్పి, వాపు, గాయాలు లేదా ఎరుపును కలిగిస్తుంది. శరీరంలో ఇన్ఫ్లమేషన్ స్థాయిలు పెరగడం మంచిది కాదు. అందుకే ఆరోగ్యకరమైన ఆహారంలో శరీరంలో మంటను తగ్గించుకోవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తక్కువ నాణ్యత గల పరుపు మీద పడుకోవడం కూడా బాడీ పెయిన్స్‌కి ప్రధాన కారణాలలో ఒకటి. పరుపు ఎగుడు దిగుడుగా ఉంటే శరీరంపై ఒత్తిడిని కలిగిస్తుంది. అంతేకాకుండా గుంతలు గుంతలుగా ఉండటం వల్ల నొప్పులు వస్తాయి. నాణ్యత లేని పరుపు వల్ల బాడీ పెయిన్స్ వస్తాయని అనేక నివేదికలు చెబుతున్నాయి. అంతేకాకుండా దుమ్ము పేరుకుపోయిన పరుపుల మీద పడుకోవడం వల్ల అలెర్జీ సమస్యలు వస్తాయి. ఎక్కువ కాలం పరుపు మీద పడుకున్నా ఈ సమస్యలు వస్తాయి. అందుకే పరుపును ఎప్పటికప్పుడూ క్లీన్ చేసుకోవాలి. మీ పరుపు సరిగ్గా లేకపోతే దాన్ని మార్చే టైమ్ ఆసన్నమైందని గుర్తించుకోండి.

ఈ రోజుల్లో చాలా మంది అధిక బరువు, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్నారు. అలాంటి వారు ఎక్కువగా నిద్ర లేవగానే బాడీ పెయిన్స్ సమస్యలతో బాధపడతారు. అదనపు శరీర బరువు వల్ల మీరు ఉదయం నిద్ర లేచినప్పుడు నొప్పులకు కారణమవుతుంది. అధిక బరువు లేదా ఊబకాయం ఉన్న శరీరం వల్ల వీపు, మెడపై అదనపు ఒత్తిడి కలుగుతుంది. దీనివల్ల నొప్పులు వస్తాయి. బరువు తగ్గడానికి.. సమతుల్య ఆహారం తీసుకోండి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయండి. జీవనశైలిలో ఒకేసారి పెద్ద మార్పులు చేయడం కంటే నెమ్మదిగా, స్థిరంగా బరువు తగ్గడం సాధారణంగా ఉత్తమం.

ఉదయం నొప్పితో మేల్కొనడం ఇతర వైద్య పరిస్థితులకు సంకేతం కావచ్చు. అవేంటంటే..

వైరల్ ఇన్ఫెక్షన్, ఒత్తిడి, ఆందోళన, రక్తహీనత, విటమిన్ డి లోపం, న్యుమోనియా అలసట, లైమ్ వ్యాధి, మల్టిపుల్ స్క్లెరోసిస్

నిద్రలేవగానే బాడీ పెయిన్స్ ఉంటే ఏం చేయాలి?

మృదువైన పరుపులు, దిండ్లు మెడ, వెన్నెముకకు మద్దతు ఇవ్వవు. అందుకే వాటిపై పడుకోవడం మానుకోండి. నిద్ర స్థితిని మార్చుకోండి. సరైన భంగిమలో నిద్రపోండి. ఎడమ వైపు పడుకోనేలా ట్రై చేయండి. ఉదయం నిద్ర లేవగానే మంచం మీదే శరీరాన్ని సాగదీసే స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయండి. నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి గోరు వెచ్చని నీరుతో స్నానం చేయండి. విటమిన్ డి సప్లిమెంట్లను తీసుకోండి లేదా కొన్ని నిమిషాలు ఎండలో కూర్చోండి. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోండి. యోగా, వాకింగ్, ధ్యానం వంటి సులభమైన వ్యాయామాలు భాగం చేసుకోండి.



Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.